ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల జిల్లా వార్తలు

5★★

గురువారం 28 మార్చి 2024

రంజాన్ వేళలు
ఇఫ్తార్ | 6:27 గురువారం
సహర్ | 4:45 శుక్రవారం

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు జరపాలి 8

ఘనంగా లక్ష్మీనృసింహుని ఉత్తర దిగ్యాత్ర 7

నిబంధనలకు నీళ్లు

- పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు
- బీఎస్ఐ గుర్తింపు లేకుండా వ్యాపారం
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ



జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): డబ్బా నీళ్లకు డబ్బులు దండిగా వెచ్చిస్తున్నా.. తాగుతున్నది మినరల్ నీరా..కాదా తేల్చుకోలేని పరిస్థితి.. దాహం వేసి వాటర్ బాటిల్‌నో.. ప్యాకెట్‌నో కొని తీరు తాగుతుంటే ప్రమాణాలు పాటించారా... గుర్తింపు ఉన్న సంస్థదేనా... చెప్పలేని పరిస్థితి.. వేసవి కాలంలో నీటి వ్యాపారానికి ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. భూగర్భ జలాలు తగ్గిపోతున్నప్పటికీ అమాంతం తోడేసి నీళ్ల వ్యాపారం ప్రతీ యేటా రూ. కోట్లలో జరుగుతోంది. సదరు వ్యాపార సంస్థలు కనీస ప్రమాణాలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డబ్బా నీళ్ల వ్యాపారం రూ. కోట్లలో..

వాస్తవంగా బీఐఎస్, ఐఎస్ఐ అనుమతులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ. 10 లక్షల నుంచి రూ. 25 లక్షల వరకు ఖర్చు వస్తుంది. కానీ ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు రెండు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వరకు ఖర్చు చేసి వాటర్‌ప్లాంట్లను విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్నారు. నెలకు పట్టణాల్లో రూ. 15 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు, మండలాల్లో రూ. 10 లక్షల నుంచి రూ. 15 లక్షల వరకు వ్యాపారం సాగుతుండగా వేసవిలో జిల్లా వ్యాప్తంగా రూ. కోట్లలోనే నీటి వ్యాపారం సాగుతున్నట్లు అంచనా.

● జిల్లాలో 1,500 వరకు..

ప్రపుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,500 వరకు వాటర్ ప్లాంట్లు ఉండగా, జిల్లా కేంద్రంలోనే 200 వరకు వాటర్ ప్లాంట్లు ఉన్నట్లు అంచనా ఉంది. వాటర్ ప్లాంట్లు. ప్రమాణాలు పాటించకపోవడంతో అవి ప్రజారోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్లను నమ్ముకొని తెచ్చుకుంటున్న డబ్బా నీళ్లతో అనారోగ్యం పాలవుతున్నారు. స్థానిక సంస్థలు, సంబంధిత అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతో వ్యాపారులు ఆడింది ఆట పాడింది పాటగా తయారైంది. మినరల్ వాటర్ పేరుతో కొందరు వ్యాపారులు జిల్లాలో అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. గుక్కెడు నీళ్లు గరళంగా మారుతున్నాయి. గొంతు తడుపుకునేందుకు ఒక్కో కుటుంబం నెలకు రూ. వందల్లో వెచ్చించాల్సి వస్తోంది. విచ్చలవిడిగా వెలుస్తున్న వాటర్ ప్లాంట్లపై అధికారుల నిఘా కరువైంది. బీఎస్ఐ స్టాండర్డ్ గుర్తింపు లేకుండానే ప్లాంట్ల నిర్వాహకులు వ్యాపారం చేస్తున్నారు. జిల్లాలో పలువురు అనుమతులు లేకుండా నీటి వ్యాపారం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్లాంట్లలో చాలా వాటికి ఎలాంటి అనుమతులు లేవని తెలుస్తోంది. ప్రతీ నిత్యం వాటర్ క్యాన్‌లు, వాటర్ ప్యాకెట్ల ద్వారా నీటిని విక్రయిస్తున్నారు. 20 లీటర్ల గల వాటర్ క్యాన్‌కు దూరాన్ని బట్టి రూ. 15 నుంచి రూ. 20 వరకు వసూళు చేస్తు న్నారు. వాటర్ ప్యాకెట్లను సైతం వివిధ ధరల్లో విక్రయిస్తున్నారు. బస్టాండులు, జనవాస ప్రాంతాల్లో ధరల ను అధికం చేసి విక్రయిస్తున్నారు.

కెమిస్ట్ లేకుండానే..

నిబంధనల ప్రకారం నీటిని 12 సార్లు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. ఫిల్టరింగ్, ఏరియేషన్, కార్బైన్ పాశ్చరైజేషన్ లాంటి ప్రక్రియలు జరపాలి. నీటి డబ్బాల్లో నీటిని నింపే ముందు 48 గంటల పాటు పక్కన నిల్వ ఉండాలి. తర్వాత కెమిస్ట్ పరీక్షలు జరపాలి. నాణ్యతా పరికరాలతో కూడిన మైక్రోబయోలాజికల్ ల్యాబ్ ఉండాలి. కెమిస్ట్‌ను నియమించుకొని ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. కొందరు వ్యక్తులు ఇలాంటివి ఏవీ లేకుండానే నీటి వ్యాపారాన్ని అక్రమంగా సాగిస్తున్నారు.

● పర్యవేక్షణ గాలికి

ఆర్వో నీటి ప్లాంట్ల ద్వారా అందిస్తున్న ప్రతీ లీటరు నీటిలో రసాయనాలు, ఖనిజాలు 500 మిల్లీ గ్రాములకు తక్కువగా ఉంటున్నాయని ఇటీవల కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో తేలింది. ఈ మేరకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ సంస్థ రెండు సంవత్సరాల క్రితం కేంద్ర పర్యావరణ శాఖకు దేశంలోని ఆర్వో ప్లాంట్లను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేసింది. అయినా యథేచ్ఛగా ఈ అక్రమ నీటి దందా కొనసాగుతోంది.

● బీఐఎస్ ఆమోదం లేకుండానే...

నిబంధనల ప్రకారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ సంస్థ (బీఐఎస్)ఆమోదం లేకుండా నీటి శుద్ధి ప్లాంట్లను నిర్వహించ వద్దు. నీటిని నింపే కాన్స్ (పాలిథీన్ లేదా పాలీప్రొపలైన్)తో తయారు చేయాల్సి ఉంటుంది. స్థానిక నీటి వ్యాపారులు కొందరు ఎలాంటి ప్రమాణాలు లేకుండా తయారు చేసిన డబ్బాలను ఉపయోగిస్తున్నారు. 2006 చట్టం సెక్షన్ 79, 80 ప్రకారం నీటి శుద్ధి ప్లాంట్లు కచ్చితంగా బీఐఎస్ ద్వారా లైసెన్స్ తీసుకొని ఐఎస్ఐ గుర్తింపు పొందాల్సి ఉంటుంది. ప్లాంట్ల నిర్వహణతో పాటు బాటిళ్లు, ప్యాకెట్స్‌కు కూడా ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలి. వాటర్ ప్యాకెట్లు, 20 లీటర్ల క్యాన్‌పై కంపెనీల పేరు, ఫోన్ నంబరు, తయారు తేదీలు ముంద్రించాల్సి ఉండగా పలువురు వ్యాపారులు నిబంధనలు పాటించడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న వ్యాపారంపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.





నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా జీవన్‌రెడ్డి



జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ టికెట్ ఖరారు అయింది. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిఉన్న జీవన్‌రెడ్డిని నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి ఏఐసీసీ బరిలోకి దింపడాన్ని పలువురు కాంగ్రెస్ నేతలు హర్షిస్తున్నారు. జీవన్ రెడ్డికి టికెట్ కేటాయించడంతో జగిత్యాల కాంగ్రెస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. 2006 సంవత్సరంలో కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2008లో మరోమారు కాంగ్రెస్ నుంచి కరీంనగర్ ఎంపీగా పోటీచేసి అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్‌కు ముచ్చెమటలు పట్టించాడు. ప్రస్తుతం మూడో పర్యాయం లోక్‌సభ ఎన్నికల్లో జీవన్‌రెడ్డి పోటీ పడుతున్నారు. జగిత్యాలకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డి జగిత్యాల నుంచి పది పర్యాయాలు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఆరు మార్లు ఎమ్మెల్యేగా గెలుపొంది తనదైన ముద్ర వేసుకున్నాడు.

● పంచాయతీ సమితితో రాజకీయ ప్రవేశం...

జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం బతికపెల్లిలో తాటిపర్తి రాంచంద్రారెడ్డి-లింగమ్మ దంపతులకు 1951, జనవరి 5న జన్మించారు. బీఏ ఎల్ఎల్‌బీ చదివిన జీవన్‌రెడ్డి జగిత్యాల కోర్టులో న్యాయవాదిగా జీవితాన్ని ప్రారంభించారు. రాజకీయంపై ఆసక్తి ఉన్న ఆయన 1981లో మల్యాల పంచాయతీ సమితి అధ్యక్షుడిగా మొదటిసారి రాజకీయ అరంగేట్రం చేశారు. ఎన్టీఆర్ స్థాపించిన టీడీపీలో చేరి 1983లో ఎమ్మెల్యేగా గెలుపొంది, మొదటిసారిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. అదే ఏడాది జనవరి 9న ఎన్టీఆర్ కేబినేట్‌లో ఎక్సైజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం నాదెండ్ల భాస్కర్ రావు కేబినేట్‌లో ఎక్సైజ్, పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరి 1985లో ఎమ్మెల్యేగా పోటీ చేసి టీడీపీ అభ్యర్థి రాజేశంగౌడ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. 1989లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994 సంవత్సరంలో పోటీచేసిన జీవన్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి ఎల్ రమణ చేతిలో ఓటమిపాలయ్యాడు. 1996లో జరిగిన ఉపఎన్నికల్లో గెలుపొందిన జీవన్‌రెడ్డి అనంతరం 1999, 2004, 2014లో జరిగిన ఎన్నికల్లో కూడా విజయం సాధించి, ఆరుసార్లు అసెంబ్లీకి ఎన్నికై రికార్డు సృష్టించారు. అప్పుడే రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

● నాడు కరీంనగర్ నుంచి...నేడు నిజామాబాద్...

2006, 2008లో కరీంనగర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి కేసీఆర్ చేతిలో ఓడిపోయారు. అయినా ఆయన ఢిల్లీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలో తనదైన గుర్తింపు పొందాడు. 2014లో జరిగిన ఎన్నికల్లో జగిత్యాల ఎమ్మెల్యేగా గెలుపొందడంతో పాటు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకైక కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభపక్ష ఉపనేతగా వ్యవహరించాడు. 2018లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్‌రెడ్డి టీఆర్ఎస్ అభ్యర్థి మాకునూరి సంజయ్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. అనంతరం 2019లో జరిగిన ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి జీవన్‌రెడ్డి పోటీచేసి మొదటి ప్రాధాన్య ఓట్లతో గెటుపొంది రికార్డు సాధించారు. శాసన మండలిలో అడుగుపెట్టిన జీవన్ రెడ్డి రైతుల, పట్టభద్రుల, ప్రజల సమస్యలపై పోరాడుతూ తనదైన ముద్రవేసుకున్నాడు. 2023 డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన బీఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్ కాంగ్రెస్ టిక్కెట్ దక్కించుకొని తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమయ్యాడు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పోతారంలో ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

సారంగాపూర్, మార్చి 27: మండలంలోని సారంగాపూర్, పోతారం గ్రామాల్లో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే డాక్టరు సంజయ్ కుమార్ బుధవారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆలయాల అభివృద్ధి కోసం అత్యధిక నిధులు కేటాయించామ న్నారు. మాజీ సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే ధ్యేయంగా కృషిచేశారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, డిల్లీ రామరావు, కిరణ్‌రావు, బైరి అంజయ్య, గుర్రం స్వామి, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో రాజకీయ నాయకులతో సిబ్బంది విందు

- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

- విచారణకు ఆదేశించిన జిల్లా అధికారులు

మల్లాపూర్, మార్చి, 27: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లోనే సిబ్బంది మండలానికి చెందిన రాజకీయ నాయకులతో కలిసి విందు చేసుకున్న ఘటన చర్చనీయంశంగా మారింది. మల్లాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సై కిరణ్‌కుమార్ జగిత్యాలలో ఈనెల 17న ప్రధానమంతి బందోబస్తు కోసం వెళ్లారు. ఆ రోజు స్టేషన్‌లోని ముగ్గురు సిబ్బంది మండలంలోని కొత్తధాంరాజుపల్లి, గుండంపల్లి గ్రామాలకు చెందిన ఇద్దరు రాజకీయ నాయకులతో కలిసి రాత్రి పోలీసుస్టేషన్ కార్యాలయంపైన విందు చేసుకున్నారు. ఈ సమయంలో అక్కడికి మరో పోలీసు అధికారి వచ్చాడు. అధికారి జరుగుతున్న విందును చూసి స్టేషన్‌లో ఇలాంటి పనులు చేయడం సరికాదని వారికి సూచించినట్టు తెలిసింది. ఈ విషయం తెలుసుకున్న స్పెషల్ బ్రాంచి అధికారులు జిల్లా ఉన్నత అధికారులకు తెలిపారు. దీంతో జిల్లా ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి విచారణకు ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయాన్ని ఎస్సైను వివరణ కోరగా స్టేషన్‌లో సిబ్బంది విందు చేసుకున్న వాస్తవమేనని, జరిగిన విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిపారు.

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి



ధర్మపురిలో 5కె రన్‌లో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు



కోరుట్లలో మానవహారం నిర్వహించిన అధికారులు, అంగన్‌వాడీ టీచర్లు

అదనపు కలెక్టర్ దివాకర

ధర్మపురి, మార్చి 27: ప్రతి వ్యక్తి నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని అదనపు కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఓటరు అవగాహన కోసం ఐ ఓటు ఫర్ ష్యూర్ అనే నినాదంతో నిర్వహించిన 5 కె రన్ కార్యక్రమాన్ని బుధవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. రన్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమై గాంధీ చౌక్, నంది చౌక్, హనుమాన్ వీధి, అంబేడ్కర్ విగ్రహ చౌరస్తా, వివేకానంద విగ్రహం మీదుగా కళాశాల వరకు సాగింది. దారి పొడవుగా పలువురు ఓటు ప్రాధాన్యం గురించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ దివాకర కార్యక్రమానికి హాజరైన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు ఓటరు లిస్టులో పేరు నమోదు చేయించుకోవాలని ఆయన అన్నారు. అలాగే ఓటు అనేది ఆయుధం అంటూ ఓటు ప్రాధాన్యం గురించి ఆయన వివరించారు. కొత్తగా యువతీయువకులు వంద శాతం ఓటింగ్ పెంచేలా చైతన్యం చేస్తూ 5 కె రన్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ 5 కె రన్ విజయవంతం చేసేందుకు తరలివచ్చిన ప్రతి ఒక్కరికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల మైదానంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, యువతీ, యువకులు, క్రీడాకారులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, విద్యార్థులు, తెలుపు రంగు టీ షర్టులు ధరించి మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్లు కృష్ణచైతన్య, మాజిద్, శేఖర్, రవికాంత్, మహ్మద్ జమీర్, శ్రీనివాస్, రజిత, ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఐకేపీ ఏపీఎంలు పాల్గొన్నారు.

కోరుట్ల: వంద శాతం ఓటు హక్కు వినియోగానికి ప్రజలు సహకారం అందించాలని కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి అనంద్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని రెవెన్యూ, ఐసీడీఎస్, మున్సిపల్, ప్రైవేట్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 5కే రన్‌ను ఆర్డీవో, నియోజకవర్గ ఎన్నికల అధికారి అనంద్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నందీ చౌరస్తాలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలోని కృష్ణుని అలయం నుంచి నందీ చౌరస్తా వరకు అధికారులు 5కే రన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంద్ కుమార్ మాట్లాడారు. ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ఓటర్లకు వివరించి వందశాతం పోలింగ్ అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ కిషన్, మున్సిపల్ కమీషనర్ తిరుపతి, వివిధ శాఖల అధికారులు, ప్రైవేట్ కళాశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలి

కొడిమ్యాల, మార్చి 27: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు రైతులు సహకరించాలని కొడిమ్యాల సింగిల్ విండో ఛైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు కోరారు. బుధవారం సింగిల్ విండో సాధారణ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈసమావేశంలో ఉపాధ్యక్షురాలు కవితచంద్రమోహన్‌రెడ్డి, డైరెక్టర్లు, సీఈవో గంగాధర్, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● పూడూర్‌లో ..

మండలంలోని పూడూర్ సింగిల్ విండో కార్యాలయంలో బుధవారం సింగిల్ విండో సాధారణ సమావేశం అధ్యక్షుడు బండ రవీందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సిబ్బందికి రైతులు సహకరించాలన్నారు. సంఘం ఆర్థిక లావాదేవీలను గురించి డైరెక్టర్లతో చర్చించారు. సమావేశంలో ఉపాధ్యక్షుడు సావనపెల్లి రమేష్, డైరెక్టర్లు, సీఈవో రాజేందర్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ తల్లిని దర్శించుకున్న 'అడ్లూరి'

ఎండపల్లి, మార్చి27: మండలంలోని కొత్తపేటలో గౌడసంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ పట్నాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బుధవారం వేర్వేరుగా దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు శైలెందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంతలు



కలికోట మూలమలుపు వద్ద ఉన్న గొయ్యి

కథలాపూర్, మార్చి 27: వేములవాడ-కోరుట్ల రోడ్డుకు ఇరువైపులా ఏర్పడ్డ గోతులు ప్రమాదకరంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యా రు. దుంపెట శివారులో ఈ ఏడాది కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై ప్రమాదకరంగా మారింది. దగ్గరి దాకా వెళ్తేగాని రోడ్డు దెబ్బతిన్న విష యం తెలియక వాహనదారులు హడలెత్తిపోతున్నారు. కలికోట శివారులో గిరిజన తండా దగ్గర ప్రైవేట్ టెలికాం కంపెనీ కేబుల్ మరమ్మతుల కోసం గోతి తవ్వి వదిలేశారు. నెలల తరబడి పూడ్చకపోవడంతో ఆ ప్రదే శం వద్ద ప్రమాదం పొంచి ఉంది. ప్రతీ దినం వందలాదిగా వాహనాలపై వేములవాడ పుణ్యక్షేత్రంకు భక్తులు వెళ్తుంటారు. ప్రమాదకరంగా ఉన్న గోతులను పూడ్చాలని ప్రయాణీకులు కోరుతున్నారు.




దుంపెట శివారులో కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ఫోన్ ట్యాపింగ్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను విచారించాలి

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి

సారంగాపూర్, మార్చి 27: ఫోన్ ట్యాపింగ్ విషయంలో అధికారులనే కాకుండా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కూడా విచారించాలని ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం సారంగా పూర్, సోతారం గ్రామాల్లో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గాలి వీస్తుందన్నారు. నిజామాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా తనకు పార్టీ అవకాశం ఇచ్చిందని కార్యకర్తలు, నాయకులు గెలిపించే బాధ్యత తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, నాయకులు కోండ్ర రాంచందర్‌రెడ్డి, ఆకుల రాజిరెడ్డి, తోడేటి శేఖర్‌గౌడ్, కొక్కు గంగారాం, ఉరుమల్ల లక్ష్మారెడ్డి, కాలగిరి మధుసూదన్, చేకుట శేఖర్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.



సారంగాపూర్‌లో పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

తేనెటీగల దాడిలో పశువుల కాపరి మృతి

మల్లాపూర్, మార్చి 27: జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన పుట్ట ధర్మయ్య(38) అనే పశువుల కాపరి తేనెటీగల దాడిలో బుధవారం మృతి చెందాడు. ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యంపేటకు చెందిన పుట్ట ధర్మయ్య బుధవారం పశువులను మేపుకుంటూ గ్రామ శివారులోకి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేయడంతో తీవ్ర అస్వస్థతకు గురికాగా మెట్‌పల్లిలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ధర్మయ్య మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ట్రాలీ ఆటోను అపహరించిన వ్యక్తిని పట్టుకున్న స్థానికులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో ఓ ట్రాలీ ఆటోను అపహరించి అనుమానాస్పదంగా కనిపించిన గుర్తు తెలియని వ్యక్తిని బుధవారం రాత్రి స్థానికులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. సిరిసిల్ల గోపాల్‌నగర్ ప్రాంతంలో నిలిపి ఉంచిన బండారి లక్ష్మణ్‌కు చెందిన ట్రాలీ ఆటోను గుర్తు తెలియని వ్యక్తి అపహరించాడు. తన వాహనం కనిపించకపోవడంతో ఆందోళన చెందిన వాహన యజమాని లక్ష్మణ్ చుట్టు పక్క గ్రామాల ఆటో డ్రైవర్లకు సమాచారం అందించాడు. వెంకటాపూర్ గ్రామ శివారులో అనుమానస్పదంగా ట్రాలీ ఆటోతో ఓ వ్యక్తి కనిపించాడు. పొంతన లేని సమాధానాలు చెప్పడంతో స్థానికులు అతన్ని తాళ్లతో కట్టేసి దేహశుద్ధి చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి 10 రోజుల జైలు శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 27: మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన ఒక వ్యక్తికి పది రోజుల జైలు శిక్ష, మరో ఇద్దరు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష, ఒక వ్యక్తికి ఐదు రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు జరిమానా పడిం దని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ ఇటీవల పోలీసులకు పట్టుబడిన 18 మందిని కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఆరుగురికి జైలు శిక్ష,మొత్తం10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు. మిగతా 12 మందికి 18,500 రూపాయల జరిమానా విధించారని తెలిపారు.

శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు

● ఈవో కృష్ణప్రసాద్


అధికారులతో మాట్లాడుతున్న ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ, మార్చి27: రాజరాజేశ్వర క్షేత్రంలో శివపార్వతుల కల్యాణానికి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో డి.కృష్ణప్రసాద్ తెలిపారు. గురువారం నిర్వహించనున్న శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లపై ఆలయ అధికారులు, పోలీసు అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారి దివ్యకల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని, ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివస్తున్న విషయం దృష్టిలో ఉంచుకుని విశాలమైన వేదికను ఏర్పాటు చేశామని అన్నారు. కల్యాణం తిలకించడానికి వీలుగా భారీ స్ర్కీన్లు అమర్చామన్నారు. భక్తులకు ఇబ్బందులు ఎదురుకాకుండా క్యూలైన్లు క్రమబద్ధీకరించామని అన్నారు. ఉత్సవాలు జరిగే ఐదు రోజుల పాటు కోడెమొక్కులు మినహా అన్ని రకాల ఆర్జిత సేవలు నిలిపివేశామని అన్నారు.

రాజన్నక్షేత్రంలో వైభవంగా శివకల్యాణోత్సవాలు

● స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ● నేడు పార్వతీరాజరాజేశ్వరస్వామివారి కల్యాణం


స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు


ధర్మగుండంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ, మార్చి27: వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామివారి దేవస్థానంలో శివకల్యాణ మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ నేతృత్వంలో అర్చకులు, వేద పండితులు ఉదయం 8-05 గంటలకు శివ భగవత్పుణ్యాహవచనము గావించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీస్వామివారి కళ్యాణ మంటపంలో ఆచార్య దంపతులు దంపతులకు, అర్చకస్వాములకు, వేదపండితులకు ఆలయ ఈఓ కృష్ణప్రసాద్ వరుణి అందజేశారు. అనంతరం అర్చకులు పంచగవ్య మిశ్రణము, దీక్షాధారణము, మంటప ప్రతిష్ఠ, నవగ్రహ ప్రతిష్ఠ, గౌరీ షోడశ మాతృకా ప్రతిష్ఠ, మృత్సంగ్రహణము, అంకురార్పణము, వాస్తు ప్రతిష్ఠ, సోమకుంభ కలశ ప్రతిష్ఠ, వాస్తుహోమము, కుండ సంస్కారం, అగ్ని ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. అంతకుముందు ఉదయం మహామండపంలో శ్రీరాజరాజేశ్వరస్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించగా, వేదపండితులు వేదపారాయణం గావించి, పరివార దేవతార్చనలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీస్వామివారి కల్యాణమంటపంలో శివపురాణ ప్రవచనం చేవారు. రాత్రి భేరీ పూజ, దేవతాహ్వనము నిర్వహించారు. శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి దివ్యకల్యాణోత్సవం 28వ తేదీ గురువారం నిర్వహించనున్నారు. కల్యాణానికి వేములవాడ దివ్యక్షేత్రం అందంగా ముస్తాబైంది. ఆలయ చైర్మన్ చాంబర్ ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఉ. 10-50 గంటల నుంచి అభిజిత్ లగ్న సుముహూర్తమున శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామివారల దివ్యకల్యాణం నిర్వహిస్తారు. సాయంత్రం శివ పురాణ ప్రవచనం, ప్రధాన హోమము, సప్తపది నిర్వహిస్తారు. శివకళ్యాణోత్సవానికి భక్తులు, శివపార్వతులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ మేరకు భక్తులు శ్రీస్వామివారి కల్యాణం వీక్షించడానికి ఆలయ ప్రాంగణంలో స్ర్కీన్‌లను ఏర్పాటు చేశారు. శివకల్యాణోత్సవాల సందర్భంగా కోడెమొక్కుతో పాటు ఐదు రోజుల పాటు అభిషేకం, అన్నపూజ తదితర అన్నిరకాల ఆర్జిత సేవలను నిలిపివేశారు.

బందోబస్తు ఏర్పాట్లు పరిశీలన

రాజరాజేశ్వర క్షేత్రంలో శివకల్యాణోత్సవాల సందర్భంగా బందోబస్తు ఏర్పాట్లను వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ అంజయ్య పరిశీలించారు. ఎద్ద సంఖ్యలో భక్తులు, శివపార్వతులు తరలివస్తున్నందున ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

దొంగల అరెస్టు

● నాలుగు ద్విచక్రవాహనాలు స్వాధీనం

కరీంనగర్ క్రైం, మార్చి 27: జల్సాలకు అలవాటు పడిన ముగ్గురు వ్యక్తులతో పాటు ఒక మైనర్ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను చోరీ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా బుధవారం కరీంనగర్ రూరల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రూరల్ సీఐ ప్రదీప్‌కుమార్, టాస్క్‌ఫోర్స్ సీఐ రవిందర్‌లు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ కృష్ణలంకకు చెందిన బోజ్జ మనోజ్ కుమార్ కొంత కాలంగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌లో నివాసం ఉంటూ వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. అతడి స్నేహితులైన హైదరాబాద్ బోయినిపల్లికి చెందిన బందెల సుమిత్, విజయవాడకు చెందిన ఎల్ల సత్య ఆంజనేయులుతో పాటు బాలుడు జల్సాలకు అలవాటు పడి డబ్బులు సరిపోనందున ఒక ముఠాగా ఏర్పడి బైక్‌లు దొంగిలిస్తున్నారు. నలుగురు కలిసి కరీంనగర్‌లోని పలు ప్రాంతాల్లో నాలుగు బైక్‌లను చోరీ చేశారు. యమహా(టీఎస్ 22 హెచ్ 6478), పల్సర్(టీఎస్ 02 ఈఆర్ 7196), పల్సర్(టీఎస్ 25 ఎఫ్ 7024), (టీఎస్ 04 ఇజి 3006)లను ఈ ముఠా చోరీ చేసింది. ఈ బైక్‌లలో ఒకటి హైదరాబాద్‌కు తరలించిన నిందితులు మిగతా మూడు బైక్‌లను కూడా తరలిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. నలుగురు నిందితులపై కరీంనగర్ రూరల్, కొత్తపల్లి, ఎల్‌ఎండీ ఠాణాలలో కేసులు నమోదు చేశారు.

భర్త చేతిలో భార్య హతం

● నిందితుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

పెద్దపల్లిటౌన్/ఎండపల్లి మార్చి 27: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన రజిత(35) భర్త చేతిలో మంగళవారం అర్ధరాత్రి హత్యకు గురైంది. నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ తన కార్యాలయంలో బుధవారం వెల్లడించారు. ఎండపల్లి మండలం మారేడుపల్లికి చెందిన యాళ్ల పున్నంరెడ్డికి అదే మండంలం నర్సింగాపూర్‌కు చెందిన రజితతో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. పున్నంరెడ్డి చెడు అలవాట్లకు బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడు. ఈ విషయమై పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. మద్యం మానేసి కొనాళ్ల సజావుగా ఉన్న పున్నంరెడ్డి రెండు నెలల క్రితం నుంచి మళ్లీ తాగుడు మొదలు పెట్టాడు. దీంతో మళ్లీ గొడవలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మద్యం తాగి వచ్చిన భర్తను మళ్లీ ఎందుకు తాగుతున్నావని భార్య ప్రశ్నించింది. మద్యం మత్తులో ఉన్న పున్నంరెడ్డి కోపోద్రిక్తుడై రజితను చేతికందిన ఇనుప వస్తువుతో తలపై బలంగా బాదడంతో రజిత అక్కడికక్కడే మరణించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతురాలు రజిత తల్లి వజ్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ మొదలుపెట్టారు. నిందితుడు పున్నంరెడ్డిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పర్చనపున్నట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో పెద్దపల్లి సీఐ రాసూరి క్రిష్ణ, బసంత్‌నగర్ ఎస్‌ఐ స్వామి పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనృసింహుని ఉత్తర దిగ్యాత్ర


లక్ష్మీ నృసింహ స్వామి వారల ఊరేగింపు సేవ


ఉసిరిక వాగు సమీపంలో లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

- ఉసిరిక వాగు వద్ద పూజలు అందుకున్న నారసింహుడు

ధర్మపురి, మార్చి 27: ధర్మపురి క్షేత్రంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీనృసింహస్వామి ఉత్తర దిగ్యాత్ర కార్యక్రమాన్ని బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య లక్ష్మీనృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవమూర్తులను సాయంత్రం వేళలో సేవలపై ఆశీనులు చేశారు. పుర వీధుల గుండా ఉత్తర దిగ్యాత్ర కోసం ఉసిరిక వాగు వద్దకు తీసుకెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్ద స్వామివారల సేవలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. దారిపొడవుగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రాత్రి వేళలో స్వామి వారల సేవలు తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణయ్య ఆధ్వర్యంలో అర్చకులు వంశీకృష్ణ, విజయ్, మోహన్, కిరణ్, నవీన్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐ ఉదయ్‌కుమార్, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, సభ్యులు రాపర్తి సాయికిరణ్, మాదాసు మల్లేష్, నేదునూర్ శ్రీధర్, కొమెరెల్లి పవన్‌కుమార్, డాక్టర్ మామిడి రాజేష్, పెరుమాండ్ల ఎల్లాగౌడ్ దంపతులు, ఆలయ సూపరింటెండెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు సంతోష్‌కుమార్, సంపత్‌కుమార్, ప్రవీణ్‌కుమార్‌శర్మ, తిరుపతి, రమేష్, మామిడివాడ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇద్దరికి జైలు

ఎల్లారెడ్డిపేట, మార్చి 27: పికప్ వాహనంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లికి చెందిన వాహన డ్రైవర్ ఆలకుంట రాజు, యాజమాని ఆలకుంట శేఖర్‌లను కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 15 రోజుల పాటు జైలు శిక్ష విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు బుధవారం తెలిపారు. ఈ నెల 26న స్టేషన్ హౌజ్ అధికారి శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలోని కానిస్టేబుళ్లు సతీష్, మహేందర్, శ్రీకాంత్‌లు అక్కపల్లి గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో వీరు ఇసుకను తరలిస్తూ పట్టుబడ్డారని పేర్కొన్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరిపై కేసు నమోదు చేశామని చెప్పారు. విచారణ జరిపి గతంలోనూ ఇద్దరిపై కేసులు ఉండడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో సిరిసిల్ల కోర్టులో హాజరు పర్చామని పేర్కొన్నారు. న్యాయమూర్తి ఆలకుంట రాజు, ఆలకుంట శేఖర్‌లకు 15 రోజుల జైలు విధించారని ఏఎస్‌ఐ కిషన్‌రావు వివరించారు.

ఇంటర్ బీసీ విద్యార్థుల ఫీజు ప్రభుత్వం భరించాలి

గణేశ్‌నగర్, మార్చి27: రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ చదివే బీసీ విద్యార్థుల ఫీజులను ప్రభుత్వం నిర్ణయించి రీయింబర్స్ రూపంలో విద్యార్థులకు అందజేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసు పెద్ది శ్రీధర్ రాజు ప్రభుత్వాన్ని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో బీసీ విద్యార్థులందరికీ పూర్తి ఫీజులు అందజేస్తామని ప్రకటించిందన్నారు.

జగిత్యాలలో ఒకరి ఆత్మహత్యాయ్నం

జగిత్యాల టౌన్, మార్చి 27: జిల్లా కేంద్రంలోని గొల్లపల్లి రోడ్‌లో బుధవారం ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ములుగు జిల్లా నూజివీడు గ్రామానికి చెందిన మణికుమార్ సతీమణి జగిత్యాలలోని చిల్డ్రన్ వెల్ఫేర్ సోసైటీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తోంది. కొన్ని రోజులుగా వారికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. బుధవారం జగిత్యాలకు చేరుకున్న మణికుమార్ తన భార్యతో గొడవకు దిగాడు. తీవ్ర మనస్థాపానికి గురైన మణికుమార్ చేతిలో పురుగుల మందు డబ్బాను పట్టుకుని స్థానిక గొల్లపల్లి రోడ్‌లో కుటుంబ కలహాలతో ఆత్మహత్యకు పాల్పడుతున్నానని పేర్కొంటూ డయల్ 100కు సమాచారం అందించాడు. తక్షణమే స్పందించిన బ్లూ కోల్ట్స్ పోలీస్ జుబేర్ సంఘటనా స్థలానికి చేరుకుని పురుగుల మందు డబ్బాను లాక్కుని రక్షించాడు. అనంతరం చికిత్స నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ములుగు జిల్లాలోని వాజేడు తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు.

కేబుల్ బ్రిడ్జిపై పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

● యువతి కారణమంటూ సూసైడ్ నోట్


రాజశేఖర్‌రెడ్డి(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 27: రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన దూది రాజశేఖర్‌రెడ్డి(28) కరీంనగర్ శివారులోని కేబుల్ బ్రిడ్జిపై బుధవారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ఒక యువతి కారణమంటూ మృతుడి వద్ద ఒక సూసైడ్‌నోట్ లభించిందని ఒకటో ఠాణా ఎస్‌ఐ స్వామి తెలిపారు. రాజశేఖర్‌రెడ్డి కరీంనగర్ మంకమ్మతోటలో ఒక అద్దె గదిలో నివాసం ఉంటూ తెలంగాణ చౌక్ సమీపం లోని ఒక మెస్ అండ్ రెస్టారెంట్‌లో 6 సంవత్సరాలుగా క్యాషియర్‌గా పనిచేస్తు న్నాడు. అతడికి ఏడాదిన్నర కిందట ఒక యువతి పరిచయం అయింది. ఇద్దరూ తరచుగా కలిసేవారు. ఇటీవల రాజశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు అతడికి వివాహం చేసేందుకు సంబంధాలు చూస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువతి తననే వివాహం చేసుకోవాలని, లేకుంటే ఇద్దరు కలిసిన ఫొటోలు, మాటల వాయిస్ రికార్డులు బయట పెడతానంటూ రాజశేఖర్‌రెడ్డిని బ్లాక్‌మెయిల్ చేస్తూ కొన్ని డబ్బులు కూడా తీసుకుంది. ఈ నెల 23న ఆ యువతితో పాటు మరికొందరు రాజశేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి గ్రామపంచాయతీ వద్ద గొడవ చేయగా గ్రామస్థులు సర్ది చెప్పి పంపించారు. రాజశేఖర్‌రెడ్డి తన కుటుంబ పరువు పోతుందని మనస్థాపంతో మంగళవారం ఉదయం కేబుల్‌బ్రిడ్జిపై పురుగుల మందుతాగి తన స్నేహితుడికి ఫోన్‌లో సమాచారం అందించాడు. వెంటనే 108 అంబులెన్స్‌లో ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లి అక్కడి నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మరణించాడని తెలిపారు. తన కొడుదు రాజశేఖర్‌రెడ్డి ఆత్మహ త్యకు యువతి, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులే కారణమంటూ మృతుడి తండ్రి దూది రఘుపతిరెడ్డి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. యువతితో పాటు ఆమె కుటుంబసభ్యులపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ స్వామి తెలిపారు.

అదృశ్యమైన విద్యార్థి మృతి

● 27రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు


అభిలాష్(ఫైల్)

తిమ్మాపూర్, మార్చి27: స్థానికంగా ఓ ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి ఈ నెల 1న కళాశాల నుంచి బయటకు వెళ్లి 27రోజుల తరువాత ఓ వ్యవసాయ బావిలో అతని మృతదేశం లభ్యమైంది. మృతుని కుటుంబ సభ్యులు, సీఐ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి జిల్లా కాటారం మండలం, దామరకుంట గ్రామానికి చెందిన ఎనగంటి శ్రీనివాస్ రజిత దంపతులకు ఇద్దరు కుమా రులు. పెద్ద కుమారుడు ఎనగంటి అభిలాష్ (26) కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్‌లోని ఓ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌లో ఉండి డిప్లొమా చదువుతున్నాడు. మార్చి ఒకటో తేదీన కళాశాల నుంచి బయటకు వెళ్లిన విద్యార్థి అభిలాష్ తిరిగి కళాశాలకు చేరుకోలేదు. ఈ విషయం అతని తండ్రికి కళాశాల వార్డెన్ సమాచారం అందించారు. దీంతో తల్లి దండ్రులు స్థానికంగా ఎల్‌ఎండి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

ఓ వివాహితను కాపాడే ప్రయత్నంలో విద్యార్థి మృతదేహం గుర్తింపు

అలుగునూర్‌కి చెందిన ఓ వివాహిత ఇంట్లో వేధిస్తున్నారని తాను బావిలో పడి చనిపోతున్నానని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వారు 100నెంబరుకు సమాచారం అందించారు. ఎల్‌ఎండీ పోలీసుల సహకారంతో తిమ్మాపూర్ స్టేజీకి సమీపంలో వ్యవసాయ బావుల వద్ద వివాహిత కోసం వెతికారు. ఆ సమయంలో ఓ వ్యవసాయ బావిలో విద్యార్థి అభిలాష్ మృతదేహంను గుర్తించారు. సంఘటన స్థలానికి తిమ్మాపూర్ సిఐ కర్రె స్వామి, ఎల్‌ఎండి ఎస్సై చేరాలు సిబ్బందితో చేరుకొని మృతదేహాన్ని బయటకు తీసి అభిలాష్ మృతదేహంగా నిర్ధారించారు. అతని తండ్రికి సమాచారం అందించి పోస్టుమార్టం చేసి మృతదేహాన్ని అభిలాష్ తండ్రి శ్రీనివాస్‌కు అప్పగించారు. తన కుమారుడి మృతి అనుమానాస్పదంగా ఉందని అభిలాష్ తండ్రి శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మరో వైపు మహిళను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రైతులను తప్పుదోవ పట్టిస్తున్న హరీష్‌రావు

● ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం పంటలు ఎండిపోకుండా చర్యలు చేపడుతుంటే రైతులు ఆందోళన చెందేలా మాజీ మంత్రి హరీష్‌రావు వాస్తవాలను వక్రీకరిస్తూ మాట్లాడుతున్నారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్‌లో బుధవారం ఎమ్మెల్సీ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. రబీ పంటల సాగు నీటి సమస్యలపై బీఆర్ఎస్ నాయకులు మాట్లాడడం విస్మయం కలిగిస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో రబీ పంటకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించకుండా ఎస్సారెస్పీలో ఉన్న నీటిని తరలించడంతో సాగు నీటి సమస్య తలెత్తిందన్నారు. 2023 సంవత్సరం జనవరితో పోల్చితే 2024 జనవరిలో 10 నుంచి 20 మిలియన్ల విద్యుత్ అధికంగా వినియోగం పెరిగిందనే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు తెలుసుకుని విద్యుత్‌పై మాట్లాడాలని హితవు పలికారు. గత ప్రభుత్వం దీర్ఘకాలిక రుణాల అప్పులపై వడ్డీ రాయితీ పూర్తిగా ఎత్తి వేసిందని, పంటల బీమా పథకానికి నిధులు చెల్లించలేక పథకాన్నే ఎత్తివేశారని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల కాలంలో ఎప్పుడైనా పంట నష్టపరిహారం చెల్లించారా అని హరీష్‌రావును ప్రశ్నించారు. పంట రుణాలకు సంబంధించి రైతులపై ఎటువంటి చర్యలు చేపట్టవద్దని, ప్రభుత్వమే రుణాలు చెల్లించేలా బాధ్యత వహించేలా బ్యాంకర్లతో పాటు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని ఇందులో ఎలాంటి అనుమానం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ముందుకు సాగుతుందన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి వైపరిత్యాల వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుని పంట ఎంత నష్టపోతే అంత పరిహారం ఇస్తామని ఈ విషయంలో సీఎం ఇదివరకే జిల్లా కలెక్టర్లుకు ఆదేశాలు ఇచ్చారని అన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి గోవర్ధన్‌కు చక్కెర ఫ్యాక్టరీ ఎప్పుడు ప్రారంభించారో, ఎవరి హయాంలో మూత పడిందో, దీనిని ఎవరు కొనుగోలు చేశారో అనే విషయాలు తెలువకుండా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. జగిత్యాల ప్రాంతానికి కవిత ఎంపీగా ఉన్న సమయంలోనే చక్కెర ఫ్యాక్టరీ పూర్తవగా మూతపడిన విషయం రైతులకు తెలుసునన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని మెనిఫెస్టోలో పెట్టామన్నారు. ఇచ్చిన హామీ నెరవెర్చేలా పునఃప్రారంభించే చర్యలో భాగంగా మంత్రి శ్రీధర్‌బాబు చైర్మన్‌గా రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసిందని వివరించారు. చక్కెర ఫ్యాకరీని పునప్రారంభం చేయించే బాధ్యత నాదేనని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, పీసీసీ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, పీసీసీ కార్యదర్శి బండ శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్త మోహన్, క్లబ్ కార్యదర్శి పుప్పాల అశోక్, ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, నాయకులు గుంటి జగదీశ్వర్, గాజుల రాజేందర్, చాంద్ పాష, శంకర్, అంజయ్య, మహేష్, మహిపాల్, వసంత్ రావు, రజనీకాంత్, విజయ్, మీర్‌ఖాజీం అలీ తదితరులు ఉన్నారు.

ఎస్‌యూలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్


ఎస్‌యూలో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొన్న కంపెనీల ప్రతినిధులు


గణేశ్‌నగర్, మార్చి27: శాతవాహన విశ్వవిద్యాలయంలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో నిర్వహించిన రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు అపూర్వ స్పందన వచ్చినట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ మనోహర్ తెలియజేశారు. ఆక్సిస్ బ్యాంక్, యాక్సెంచర్, పతంజలి సంస్థలు రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించాయని తెలిపారు. దీనికి 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో యాక్సిస్ బ్యాంక్‌కు పదిమంది, యాక్సెంచర్‌కు ఆరుగురు, పతంజలిలో 13మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మొత్తం 31 మంది ఎంపికయ్యారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్, శాతవాహన విశ్వవిద్యాలయం డాక్టర్ ఈ మనోహర్ తెలియజేశారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.1.11కోట్లు


కొండగట్టులో హుండీ లెక్కిస్తున్న భక్తులు

మల్యాల, మార్చి 27: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం హుండీల ఆదాయాన్ని అధికారులు బుధవారం లెక్కింపు చేపట్టారు. 48 రోజులకు ఈ హుండీల ద్వారా రూ.1,11,07,329 నగదు దేవస్థానానికి సమకూరింది. ఈ లెక్కింపులో నగదుతో పాటు 74 గ్రాముల మిశ్రమ బంగారం, 5.500కిలోల మిశ్రమ వెండి, 40 విదేశి కరెన్సీ లభించినట్లు ఈఓ చంద్రశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ దేవాదాయ శాఖ డీసీ జి సంజీవరెడ్డి పరిశీలకులుగా పాల్గొనగా ఏఈవో వైరాగ్యం అంజయ్య, ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సునీల్, ఆలయ సిబ్బంది, ఏఎస్సైలు చిలుక శ్రీనివాస్, రమణారెడ్డి తదితరులు ఈ లెక్కింపులో ఉన్నారు.

పొలాసలో వ్యవసాయ పరిశోధనలపై సమావేశాలు


హాజరైన అధికారులు, రైతులు

జగిత్యాలరూరల్, మార్చి 27: ఉత్తర తెలం గాణ మండల వ్యవ సాయ పరిశోధన విస్తరణ సలహా సంఘ వానాకాలం- యాసంగి పంటలకు సంబంధించిన సమావేశాలు జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానంలో బుధవారం ప్రారంభం అయ్యాయి. విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకులు సుధారాణి, జ్యోతి ప్రజ్వలనచేసి సమా వేశాన్ని ప్రారం భించారు. పొలాస పరిశోధన కేంద్రంలో గత సంవత్సరంలో జరిగిన పరిశోధన ఫలితాలను డాక్టర్ శ్రీనివాస్ రైతులకు వివరించారు. అనంతరం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మంజులత గత సంవత్సరంలో సలహా సంఘంలోని రైతుల సందే హాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తర తెలంగాణ జిల్లాల వ్యవ సాయ అధికారులు వారి జిల్లాలో ఉన్న పంటలు, ఆ పంటలలోని సమస్యలను, ఇబ్బందులను, ఫలితాలను ప్రజెంటేషన్ రూపంలో తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

1300 కేజీల పేలుడు పదార్థాల పట్టివేత

● ఇద్దరి అరెస్టు, వాహనం సీజ్


పేలుడు పదార్థాలను చూపిస్తున్న సుధీర్‌రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 27: జిల్లాలో పేలుడు పదార్థాలను అక్రమ రవాణా చేస్తే ఊరుకోమని, అలాంటి వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ హెచ్చరించారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. మరిపెడ మండలం వీరారం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జగిత్యాల జిల్లా నుంచి మరిపెడకు వస్తున్న ఓ బోలెరో ట్రాలీ వాహనం పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారని, దీంతో అప్రమత్తమైన పోలీసులు ఆ వాహనంను తనిఖీ చేశారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం జగదేవ్‌పేట చెందిన కస్తూరి కుమార్, కస్తూరి సారయ్య, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం దంటకుంట తండాకు చెందిన దరావత్ కిశోర్ కలిసి బోలెరో ట్రాలీలో 50 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్, 32 బాక్సులలో జిలెటిన్‌జిక్స్ పవర్ మొత్తం 6400, 20 బాక్సుల్లో జిలెటిన్ స్టిక్స్ పవర్ బూస్టర్‌లు 180, మొత్తం పేలుడు పదార్థాలు 1300 కేజీలను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడులు నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకుని రవాణాకు ఉపయోగించిన ట్రాలీ సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. కస్తూరి కుమార్ తండ్రి సారయ్య పేరుమీద వెంకటరమణ ఎంటర్‌ప్రైజెస్ తెలంగాణ జగిత్యాల జిల్లా వెలగటూరు మండలం జగదేవ్‌పేట పేరుపై లైసెన్స్ తీసుకుని లైసెన్స్ ప్రకారం కేవలం నిర్ణీత పరిధిలో మాత్రమే పేలుడు పదార్థాలను అమ్ముకోవాల్సి ఉందన్నారు. కానీ, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతోనే అక్రమంగా పేలుడు పదార్థాలను అనుమతి లేనివారికి విక్రయిస్తూ పట్టుబడ్డారని, ఈ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు. ప్రస్తుతం కస్తూరి సారయ్య పరారీలో ఉన్నట్లు చెప్పారు. త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఏఎస్పీ జోగుల చెన్నయ్య నేతృత్వంలో ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించిన మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తహేర్‌బాబా, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల అభివృద్ధి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు



పార్టీ కండవా కప్పి ఆహ్వానిస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల, మార్చి 27: కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం పట్టణంలోని మహాదేవస్వామి ఆలయ చైర్మన్, సింగిల్ విండో డైరెక్టర్ పిట్ల నరేష్, డైరెక్టర్ వోలేపు రాజేష్ కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో ప్రత్యేక చొరవ చూపుతుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బోయినిపల్లి సత్యంరావు, కాంగ్రెస్ నాయకులు ఆడెపు మధు, గుర్రాల ప్రవీణ్, మ్యాకల నర్సయ్య, దండవేని వెంకటి, ఎంబేరి సత్యానారాయణ, అక్బర్, అశోక్, కిషోర్, కొంతం రాజం, నయీం, మచ్చ కవిత పాల్గొన్నారు.

తుర్తిలో ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు



తుర్తిలో ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు

కథలాపూర్, మార్చి 27: మండలంలోని తుర్తిలో బుధవారం జరిగిన ఎల్లమ్మ సిద్దోగంలో వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎమ్మెల్యేకు వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించగా స్థానికులు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, ఆదిరెడ్డి, స్థానికులు ఉన్నారు.

బాధితుడికి విప్ అడ్లూరి పరామర్శ

వెల్గటూర్, మార్చి 27: మండలంలోని రాజక్కపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక మనోహర్ ఇటీవల తుంటి ఎముక ఆపరేషన్ చేయించుకోగా బుధవారం ఆయనను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసి ధైర్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, నాయకులు మేరుగు మురళి, సందీప్‌రెడ్డి, బొడ్డు సంతోష్, ఎర్రోళ్ల సతీష్ సంకోజు సురేష్, సంతోష్, మధు పాల్గొన్నారు.

ఘనంగా నాటక రంగ దినోత్సవం

కొడిమ్యాల, మార్చి 27: మండల కేంద్రంలో శ్రీతారకరామ కళా నిలయం సభ్యులు ప్రపంచ నాటక రంగ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాటక రంగ పితామహులు చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా కళా నిలయం సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుత్తం నాటకరంగ ప్రదర్శనలకు యువత ముందుకు రావాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కళా నిలయం సభ్యులు బోమ్మ సురేష్, గడ్డం చంద్రమోహన్‌రెడ్డి, ఇనుగంటి సత్యానందం, ఏనుగు ఆదిరెడ్డి, ఎర్రోజు మోహనాచారి, డి నర్సయ్య తదితరులు ఉన్నారు.


ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రావణ్

కోరుట్ల, మార్చి 27 : పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలో బుధవారం కరీంనగర్‌కు చెందిన మెడికవర్ అసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య పరీక్ష శిబిరం నిర్వహించగా విశేష స్పందన లభించింది. అసుపత్రి వైద్యులు శ్రావణ్ ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి గుండెకు సంబంధించి వ్యాధిపై తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. గుండె సంబంధిత వ్యాధితో బాధపడేవారు ఆరోగ్యశ్రీ పథకం చికిత్స నిర్వహించుకోవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన అసుపత్రి వైద్యులు, సిబ్బందికి పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్, సంఘం సభ్యులు ఎంబేరీ నాగభూషణం, ఎక్కులదేవి నవీన్, ముల్క ప్రసాద్, గడ్డం మధు, కౌరకొండ రాజగంగారం, గుండెటి రాజశేఖర్, అందె రమేష్ సన్మానించి అభినందించారు. కార్యక్రమం లో అసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, మార్కెట్ సిబ్బంది చంద్రశేఖర్, కంబాజీ సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన నాయకులు



మంత్రి శ్రీధర్‌బాబుతో కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లి, మార్చి 27: ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునర్ధరణకు కృషి చేస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కృతజ్ఞతలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు కొమిరెడ్డి కరంచంద్, కొమిరెడ్డి విజయ్‌ఆజాద్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో మంత్రిని వారు కలిసి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని డిమాండ్ చేస్తూ పోరాటం చేసిన రైతులు, కార్యకర్తలపైన పెట్టిన పోలీసు కేసులను ఎత్తివేయాలని మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించారన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఎన్ని సవాళ్లు వచ్చిన షుగర్ ఫ్యాక్టరీని ఈ సంవత్సరం చివరిలోపు తెరిపిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎవరైనా కేసులతో ఇబ్బందులు పడితున్న రైతులు, కార్యకర్తలు, ప్రజలు న్యాయ సలహాల కోసం తమను సంప్రదించాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

పల్లెల్లో ప్రమాద ఘంటికలు

- నిలిచిన మిషన్ భగీరథ నీటి సరఫరా
- అడుగంటిపోతున్న బోర్లు
- ముందస్తు చర్యలు చేపట్టని ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం

కథలాపూర్, మార్చి 27: పల్లెల్లో మంచినీటి ఎద్దడి సమస్య ముంచుకొస్తోంది. ఇప్పటికే బావులు, బోర్లలో నీరు అడుగంటి పోయిన నేపథ్యంలో తాగునీటికి తంటాలు ఏర్పడుతున్నాయి. మార్చిలోనే ఈ పరిస్థితి తలెత్తుతుండగా రాబోయే మూడు నెలల్లో ఎదురయ్యే ఇబ్బందులపై ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఇప్పటి నుంచే గ్రామీణ రక్షిత మంచినీటి విభాగం అధికారులు ముందస్తు చర్యలకు ఉపక్రమిస్తేనే తాగునీటి అవస్థలు తీరే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

● జాడలేని మిషన్ భగీరథ నీరు..

మండలంలోని 19 గ్రామాలకు మిషన్ భగీరథ పైపులైను వేసినప్పటికీ పూర్తిస్థాయిలో నీటి సరఫరా కావడం లేదు. తరచూ పైపులు లీకేజీ కావడంతో కొన్ని గ్రామాలకు నీరు అందని పరిస్థితి ఉంది. గత నెల రోజుల నుంచి పల్లెలకు మిషన్ భగీరథ నీరే రావడం లేదు. దీనికి తోడు గ్రామాల్లోని వీధుల్లో ఉన్న బోర్లలో రోజురోజుకూ నీటి మట్టం తగ్గిపోతుండడం కలచివేస్తోంది. వీధుల్లో ఉన్న బోర్లకు ఆ వీధిలో ఉన్న వారే విద్యుత్ బిల్లులు చెల్లించుకుంటూ ఇంటింటికీ పైపులు ఏర్పాటు చేసుకున్నారు. వాస్తవానికి మిషన్ భగీరథ నీరు రోజుకు రెండుసార్లు గ్రామాల్లోని ట్యాంకులకు నీరు సరఫరా చేయాల్సి ఉండగా అగ్రహారం నుంచి పంపింగ్ సమస్య ఉందని ఆ విభాగం చేతులెత్తేసింది. చేతిపంపులు 150 ఉండగా అందులో 45



ఊట్‌పల్లిలో బోరుకు ఏర్పాటు చేసిన పైపులు

పనిచేయడం లేదు. రక్షిత మంచినీటి బావులు 11 ఉండగా 9 బావుల్లో కొంతమేర నీరు ఉంది. 77 బోర్‌వెల్స్‌కుగాను 24 పనిచేయకపోవడం వల్ల తాగునీటికి సమస్య ఏర్పడవచ్చని ప్రజలు ఆవేదన చెందుతున్నారు.

● అద్దె బోర్లు, ట్యాంకర్లే దిక్కు

మండలం నాన్ కమాండ్ ఏరియా కావడం మూలానా ఏటా భూగర్భ జలాల సమస్య మార్చిలోపే తీవ్రం అవుతుంది. అద్దెకు బోర్లను రైతుల నుంచి తీసుకుని వాటర్ ట్యాంకులకు అనుసంధానంగా ఉన్న పైపుల ద్వారా నీటిని సరఫరా చేస్తే సమస్య పరిష్కారం కానుందని అభిప్రాయపడుతున్నారు. అంతేకాకుండా ఎత్తుగా ఉన్న ప్రాంతాలకు ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీరు అందించాల్సి ఉంది.

● ఉన్నతాధికారులకు నివేదించాము

చంద్రశేఖర్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్



మండలంలో రాబోయే మూడు నెలల్లో ఎదురయ్యే తాగునీటి ఇబ్బందులను అంచనా వేశాము. గ్రామాల వారీగా ప్రణాళికలు తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదించాము. తాండ్ర్యాల, బొమ్మెన, దుంపెట, దూలూరు, భూషణరావుపేట గ్రామాల్లో తీవ్ర నీటి ఎద్దడిని గుర్తించి బోర్లను అద్దెకు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు ఇచ్చాం. తాగునీటి ఎద్దడి నివారణ కోసం ముందస్తు చర్యలు చేపడుతాము.

మిషన్ భగీరథ, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలి

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మల్లాపూర్, మార్చి 27: గ్రామాల్లోని మిషన్ భగీరథ నీటి సరఫరా, డ్రైనేజి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆదేశించారు. గుడ్ మార్నింగ్ కోరుట్ల కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు. గ్రామాల్లోని రోడ్లు, మురికి కాలువలు, పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఇబ్బందుల గురించి గ్రామస్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని మిషన్ భగీరథ నీటి సరఫరా పైప్ లీకేజీలను వెంటనే మరమ్మతులు చేపట్టాలని, గ్రామంలో పేరుకుపోయిన చెత్తను వెంటనే తొలగించాలని, పారిశుధ్యం పనులనుఎ ఎప్పటికప్పుడు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా ఆదేశించారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా గ్రామంలో పలువురు ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారిని పరిశీలించి వైద్యం గురించి పలు సూచనలు, జాగ్రత్తలు తెలిపి మందులు వాడాలని సూచించారు. వేసవిలో మంచి నీటి సమస్యలు లేకుండా అధికారుల తగు చర్యలు చేపట్టాలని, సాగు చేస్తున్న పొలాలకు నీటి సమస్యలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గ్రామాలను ప్రత్యేక అధికారుల ప్రతి రోజు



వెంకట్రావుపేటలో మురికి కాలువలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

సందర్శించి పారిశుధ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట నాయకులు ఆదిరెడ్డి, నరేష్, తోట శ్రీనివాస్, మల్లయ్య, తదితరులు ఉన్నారు.

పశువుల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

కోరుట్ల రూరల్, మార్చి 27 : పశువుల సంరక్షణకు యజమానులు చర్యలు తీసుకొని గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించాలని నియోజకవర్గ మానిటరింగ్ అధికారి, అసిస్టెంట్ డైరెక్టర్ బక్కయ్య అన్నారు. బుధవారం మండలలోని జోగినిపల్లిలోలో వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్ 329 గేదెలకు, 16 ఆవులకు వ్యాధి నివారణ టీకాలను వేసి పశువుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది నయిద్, పలువురు పాల్గొన్నారు.



పశువుకు టీకా వేస్తున్న అధికారులు

గురుకుల డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

జగిత్యాలరూరల్, మార్చి 27 : తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయినట్లు జగిత్యా ల రూరల్ మండలం తిమ్మాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో డిగ్రీ కాలేజీలలో అడ్మిషన్లకు టీఎస్‌ఆర్‌డీసీ సెట్ ను ఏప్రిల్ 28న నిర్వహించనున్నట్లు ఆయా విద్యాసంస్థలు ఉమ్మడి ప్రకటన విడుదల చేసినట్లు ఆమె పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కోసం ఏప్రిల్ 12 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తిచేసుకున్న విద్యార్థులు ఈ పరీక్షకు అర్హులని తెలిపారు. ప్రస్తుతం బీసీ గురుకులం పరిధిలో 15 బాలురు, 15 మహిళా డిగ్రీ కళాశాలలు, ఎస్సీ గురుకులం పరిధిలో 26 మహిళా కాలేజీలు, ఎస్టీ గురుకులంలో ఆరు బాలురు, 15 మహిళా కళాశాలలు ఉన్నాయని తెలిపారు. ఆయా కళాశాలల్లో బీఏ, బీకామ్, బీఎస్సీ, బీబీఏ, బీహెచ్‌ఎంసీటీ, బీఎస్ సహా వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 40 సీట్లు ఖాళీలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిల గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని శ్రీలత కోరారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతలు

కోరుట్ల, మార్చి 27: పట్టణంలోని 21వ వార్డులో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ బీఆర్ఎస్ నాయకులతో కలసి పాల్గొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాట చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్నం అనిల్ కుమార్, మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్ పలువురు పాల్గొన్నారు.

● పట్టణంలోని 8వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు కాంగ్రెస్ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కాంగ్రెస్ యువజన నియోజకవర్గ అధ్యక్షుడు ఏలేటి మహిపాల్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మెన్ రఫీయోద్దిన్ నాయకులు నేమూరి భూమయ్య, ఖయ్యూం, వసీం, నజీమోద్దిన్, అన్వర్, సోగ్రబీ, చాంద్ పాషా పలువురు పాల్గొన్నారు.

పకడ్బందీగా ధాన్యం కొనుగోళ్లు జరపాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల, మార్చి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా జరపాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 2023-24 యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన సలహాలు, సూచనలు ఆదేశాలు అందించారు. జిల్లాలో 1,18,824 హెక్టార్లలో వరి సాగు చేశారని, ఇందుకు గానూ 5,65,241 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలకు వస్తుందని అంచనా ఉందన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, అదనపు సూపరెంటెండెంట్ ఆఫ్ పోలీస్, జిల్లా పౌరస రఫరాల అధికారి, జిల్లా పౌరసరఫరాల మేనేజర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి, జిల్లా సహకార అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

వైభవంగా అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవం



హోమ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు దంపతులు

మెట్‌పల్లి, మార్చి 27: పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవాలయం 28వ వార్షికోత్సవాన్ని ఆయల వ్యవస్థాపకుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, సరోజన దంపతులు వైభవంగా జరిపించారు. ప్రతి సంవత్సరం హోలీ పౌర్ణమి తరువాత నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయంలో పురోహితులు నారబట్ల హరిప్రసాద్ పూజ కార్యక్రమాల ను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్, సరోజమ్మ దంపతులతో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఆలయంలోని గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, పంచముఖి అంజనేయస్వామి విగ్రహ మూర్తులకు 108 పాదులతో అభిషేకాలు జరిపించారు. అనంతరం మహా యజ్ఞం, అష్టదిక్కుల్లో బలిహరణ, ఆలయ శిఖరాలకు సుగంధ దవ్యాలతో అభిషేకం, హోమం, పూర్ణాహుతి, హారతి తదితర కార్యక్రామలను పురోహితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కనుల పండుగగా జరిపించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ స్వామి వారి దయతో నియోజకవర్గంలోని ప్రజలు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో ఎల్లపుడు ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రానావేణి సత్యనారాయణ, అంగడి పురుషోత్తం, కోట బుచ్చిగంగధర్, మంత్రి అంజయ్య, అంకతి భరత్‌కుమార్, కున గోవర్ధన్, బొమ్మకంటి గోపి, చెపూరి రాము, అవుట్ల లక్ష్మణ్, చింత లవకుమార్, చిలమంతుల శివకుమార్, బండారి మారుతి, అరె రమేష్, మాలోజీ శేషు, మనోజ్, చిన్నయ్య, అర్చకులు అశోక్‌శర్మ, శుక్ల సాగర్‌శర్మ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

ధర్మపురి, మార్చి 27: ధర్మపురి క్షేత్రంలో జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధ ఆలయాల్లో ఎనిమిదో రోజు బుధవారం భక్తుల రద్దీ స్వల్పంగా పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. స్వామి వారలకు బెల్లం, అమ్మవారలకు ఒడి బియ్యం సమర్పించారు. చిన్న పిల్లలను నిలువెత్తు బంగారం (బెల్లం) తులా భారం వేయించి స్వామి వారికి సమర్పించారు. ఆలయం ఆవరణలో భక్తులకు బెల్లం పంచి పెట్టారు. ఆలయాల్లో వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల వద్ద సకల బాధల నివారణ కోసం భక్తులు హోమం జరిపించారు. లక్ష్మీనృసింహ, వేంకటేశ్వరస్వామి ఆలయాల ఆవరణలో యజ్ఞాచార్యులు కందాలై పురుషోత్తమాచార్యులు, ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్థాపిత దేవతా, విశ్వక్ సేన, గరుడ, నిత్య, సుదర్శన, గరుడ హోమాలు, లక్ష్మీ హవనం నిర్వహించారు. అలాగే కొందరు భక్తులు కుంకుమార్చనలు జరిపించారు. అనేక మంది హారతి మొక్కులు చెల్లించుకున్నారు. బ్రాహ్మణవీధిలో అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా బటర్ మిల్క్, మినరల్ వాటర్ సరఫరా చేశారు. సంగనభట్ల పెద్దనరేందర్, పాత బాలచందర్, పెండ్యాల మహేందర్ సేవలు అందించారు.

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రూ 1,78,873 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు. ఇందులో వివిధ రకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ 53,816, ప్రసాదాలు విక్రయించగా రూ 1,11,750 లభించాయి. అలాగే అన్నదానం కోసం భక్తులు సమర్పించిన విరాళాలు రూ 13,307 ఉన్నట్లు ఆయన వివరించారు.



స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

● బ్రహ్మోత్సవాల్లో నేడు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 28న గురువారం సాయంత్రం నాలుగు గంటలకు వేంకటేశ్వరస్వామి వారల దక్షిణ, ఉత్తర దిగ్యాత్రలు, రాత్రి ఎనిమిది గంటలకు దోపోత్సవం (దోపుకథ) ఉంటుంది. శేషప్ప కళావేదికపై రాత్రి వేళలో గుండి ప్రేమ్‌కుమార్‌చే మిమిక్రీ, డి పురుషోత్తం మిమిక్రీ ఉంటుంది. జగిత్యాలకు చెందిన వి శార్వాణి భక్తి సంగీతం, కుమారి లాస్య, శ్రీకృతి కూచిపూడి నృత్య ప్రదర్శన, ఆనంద్‌వర్ధన్ ఏకపాత్రాభినయనం, చక్రపాణి కిరణ్‌కుమార్ ఆలయ అర్చకులు చక్రపాణి కిరణ్‌కుమార్‌చే దోపుకథ, లక్ష్మీనరసింహ నాట్యమండలి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ రాయభారం పౌరాణిక నాటకం ఉంటుందని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.



భక్తి సంగీతం పాటలు పాడుతున్న బృందం

● ఆకట్టుకున్న భక్తి సంగీతం

ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళావేదికపై మంథనికి చెందిన జి. మాధవి బృందంచే నిర్వహించబడిన భక్తి సంగీతం, లలిత సంగీత కార్యక్రమాలు బుధవారం రాత్రి భక్తులను ఆకట్టుకున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శేషప్ప కళావేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అక్కపెల్లి రాజ రాజేశ్వరస్వామి భజన మండలి సభ్యులు భక్తి పాటలు పాడుతూ అలరించారు. కొరిడె నరహరి, రాజేశ్వరి శాస్త్రీయ సంగీతం పలువురు భక్తులను అలరించింది. ప్రోగ్రాం ఇంచార్జ్‌గా ఎస్ఎల్ఎన్ నాట్యమండలి కార్యదర్శి కొరిడె నరహరి, పక్క వాద్య కళాకారులుగా కె రామయ్యశర్మ (కీబోర్డు), ఎస్ వేణుగోపాల్ (మృదంగం), రమేష్ (తబలా), శ్రీధర్ (కీబోర్డు), రాజేశం (మృదంగం, తబలా, మోర్‌సింగ్), రవీందర్ (ఫ్లూట్), సంతోష్ (మృదంగం) వ్యవహరించారు.